

డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు వృత్తి ప్రవేశ శిక్షణ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 ద్వారా ఇటీవల నియమితులైన ఉపాధ్యాయులకు వృత్తి ప్రవేశ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ స్థలం కామారెడ్డిలో ఈనెల 28, మార్చి 1,3 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. హైస్కూల్ ఉపాధ్యాయులకు నిజామాబాద్‌లో మార్చి 4 నుంచి 6 వరకు, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మార్చి 10 నుంచి 12 వరకు నిజామాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఇన్‌చార్జ్ మంత్రి (ఫైల్)

తుది అంకానికి సమరం

- రేపటితో ముగియనున్న ప్రచారం
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి రాష్ట్రస్థాయి నేతలు
- నేడు నిజామాబాద్‌లో సీఎం పట్టభద్రులతో సమావేశం
- ఇటీవల కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి ప్రచారం
- బీజేపీ అభ్యర్థి తరఫున క్షేత్రస్థాయిలోకి పార్టీ శ్రేణులు
- మరోవైపు పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- జిల్లాలో పట్టభద్రులవి 16,156 ఓట్లు, ఉపాధ్యాయులవి 1,995 ఓట్లు

కామారెడ్డి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరింది. రెండు రోజుల్లో ప్రచార పర్వం ముగియనున్న నేపథ్యంలో బరిలో ఉన్న ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. ప్రధానంగా అధికార పార్టీ కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎలాగైన కైవసం చేసుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగి అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయులతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. బీజేపీ సైతం పట్టు సాధించేందుకు కేంద్ర మంత్రిని, రాజ్యసభ సభ్యుడిని, ఎమ్మెల్యేలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు వెళుతూ ఓటర్ల మద్దతు కూడబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది.

పట్టభద్రులవి 16,156.. ఉపాధ్యాయులవి 1,995 ఓట్లు

జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 16,156 ఉండగా ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 9,215 ఉండగా పురుషులవి 6,180, స్త్రీలవి 3,035 ఓట్లు ఉన్నాయి. ఎల్లారెడ్డిలో మొత్తం ఓట్లు 2,617 ఉండగా పురుషులవి 1,992, స్త్రీలవి 625, జుక్కల్‌లో మొత్తం ఓట్లు 4,325 ఉండగా పురుషులవి 3,267, స్త్రీలవి 1,057 ఓట్లు ఉన్నాయి. ఉపాధ్యాయుల ఓట్లు 1,995 ఉన్నాయి. ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,327 ఉండగా పురుషులవి 822, స్త్రీలవి 505, ఎల్లారెడ్డిలో మొత్తం 163 ఓట్లు ఉండగా పురుషులవి 109, స్త్రీలవి 54, జుక్కల్‌లో మొత్తం ఓట్లు 505 ఉండగా పురుషులవి 371 స్త్రీలవి 137 ఓట్లు ఉన్నాయి. ఈనెల 27న ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేసింది. పట్టభద్రులకు 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉపాధ్యాయులకు 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా నోడల్ అధికారులను, జోనల్, రూట్ అధికారులను నియమించారు.

సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నం

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి ఉన్నాడు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జీవన్ రెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌పై 39,430 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని మరోమారు కైవసం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తు ప్రచారం హోరెత్తిస్తోంది. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కామారెడ్డి జిల్లా కేంద్రంలో, బాన్సువాడలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎక్సైజ్, పర్యాటకశాఖ, ఇన్‌చార్జ్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావులు, ఎమ్మెల్యేలు పట్టభద్రులతో సమావేశమై ప్రచారం నిర్వహించారు. కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పట్టభద్రుల అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించడంతో పాటు రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తు వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనంతో పాల్గొని అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించనున్నాడు.

పట్టు సాధించేందుకు బీజేపీ

బీజేపీ సైతం ఎలాగైన పట్టభద్రుల, ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపొంది మరింత పట్టు సాధించేందుకు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తోంది. పార్టీ శ్రేణులు ఒకవైపు ప్రతీ పట్టభద్రుడిని, ఉపాధ్యాయులను కలుస్తు అంజిరెడ్డి, కొమురయ్యలను గెలిపించేందుకు కృషి చేస్తుంటే మరోవైపు జాతీయ, రాష్ట్ర నేతలు, ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటున్నారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లింగాపూర్ వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆత్మీయ సమ్మేళనంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రచారం నిర్వహించారు. గత వారం కిందట రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ జిల్లా కార్యాలయంలో పట్టభద్రులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఇక్కడే మకాం వేసి ప్రచారం ముమ్మరం చేశారు. జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఒకరే ఉండడంతో రాష్ట్ర, జిల్లా నాయకత్వాన్ని సమన్వయం చేస్తు రెండు స్థానాలను గెలిచుకునేందుకు దిశా నిర్దేశం చేస్తూ వస్తున్నారు.

మోత మోగుతున్న ఓటర్ల సెల్‌ఫోన్‌లు

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సెల్‌ఫోన్‌ల మోత మోగుతోంది. అభ్యర్థి పేరుతో కూడిన వాయిస్ కాల్స్ వస్తున్నాయి. అభ్యర్థి పేరు చెబుతూ తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. వీటితో పాటు ఓటర్లకు బల్క్ మెసేజ్‌లు వాట్సాప్ సందేశాలు షేర్ చేస్తున్నారు. ఒక్కో ఓటరుకు రోజులో పదుల సంఖ్యలో ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని ఇదేక్కడి మోతరా నాయనా అంటూ ఓటర్లు విసుగు చెందుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. ఇండిపెండెంట్‌లు పోటీలో నిలుస్తున్నప్పటికీ ప్రచారంలో మాత్రం కాంగ్రెస్, బీజేపీలు దూసుకుపోతున్నాయి. అయితే మరో మూడు రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తిగా మారింది. దీనికి తోడు ఓటర్ల సంఖ్య పెరగడంతో అభ్యర్థులకు ఖర్చులు సైతం తడిసిమోపేడు అవుతున్నాయి. అభ్యర్థుల మధ్య పోటీ పెరగడంతో విజయంపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంటుంది.


రెండు రోజుల క్రితం కామారెడ్డిలో ప్రచారం నిర్వహించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిరుద్యోగుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వచ్చిన సంవత్సరంలోనే వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని త్వర లోనే మరిన్ని ఉద్యోగాలను భర్తీ చేయనుందని తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్‌ల కోసం నిరుద్యోగులు కండ్లు కాయాలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేందని ప్రస్తుతం వెంటవెంటనే ఉద్యోగ నోటిఫికేషన్‌లు జారీ చేస్తు ఉద్యోగాలు వచ్చేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ప్రతీ ఒక్క పట్టభద్రుడు నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపి ంచాలని కోరారు. అనంతరం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం సభ్యుడు నరేందర్‌రెడ్డికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని లేటర్‌ను షబ్బీర్ అలీకి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు ఐరేని సందీప్ తదితరులు పాల్గొన్నారు.


నిరుద్యోగులతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

నేడు నిజామాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

నిజామాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్ జిల్లాకు వస్తున్నారు. జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి గార్డెన్‌లో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొననున్నారు. పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఆయన ఈ ప్రచారంలో పాల్గొంటారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఇతర మంత్రులు కూడా పాల్గొననున్నారు. సీఎం రాక సందర్భంగా భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జిల్లాకు వస్తుండటంతో పార్టీ నేతలు పూర్తిస్థాయిలో ఈ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల నుంచి గ్రాడ్యుయేట్ ఓటర్లను ఈ సమావేశం కోసం తరలిస్తున్నారు. ఈ తొమ్మిది నియోజకవర్గాలతో పాటు కోరుట్ల, నిర్మల్ నియోజకవర్గం నుంచి కూడా కొంత మంది హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 500 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు వచ్చే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ సమావేశాన్ని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

నేడు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ రాక

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ రానున్నట్లు అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బార్ అసోసియేషన్, జిల్లా గ్రంథాలయం వద్ద పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

మాచారెడ్డి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానంలో పుట్టువెంట్రుకలు, ఓడిబియ్యాలు, వాహనపూజలు, గండ దీపాలు, మొక్కుబడుల కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్‌లో సుమారు గంటన్నరసేపు వేచి చూడాల్సి వచ్చింది. చుట్టు పక్కల జిల్లాలతో పాటు మండలాల నుంచి పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

నిధులు లేక నిరాశలో పంచాయతీ కార్యదర్శులు

- ఏడాదిగా పల్లెల్లో ప్రత్యేక పాలన
- నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంఘం నిధులు
- అప్పులు చేసి పనులు చేయిస్తున్న కార్యదర్శులు
- బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు


రాజంపేటలో ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రత్యేక పాలన మొదలై ఏడాది అయినప్పటికీ ఎలాంటి ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాలకవర్గాలు లేక పనులు, సమస్యలు పరిష్కారం కాక అటు ప్రజలు ఇటు పనులు చేయించుదామంటే నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అత్యవసర పనులు చేపడుదామంటే కనీస నిధులు లేకపోవడంతో అప్పులు చేసి పనులు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పంచాయతీ కార్యదర్శులు నిరాశ చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పైసా నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారం పడుతుందని వాపోతున్నారు. పోని ఆయా గ్రామ పంచాయతీల్లో వసూలు చేసిన పన్నుల ద్వారా అత్యవసర పనులు చేయిద్దామంటే అకౌంట్ ఫ్రీజింగ్ ఉండడంతో వారి జేబుల్లోంచి డబ్బులు పెట్టి పనులు చేయాల్సి వస్తోంది. పోని చేసిన పనులకైనా ఎంతోకొంత బిల్లులు వస్తే కొద్దిమేర ఊరట లభించి గ్రామాలలో మిగిలిన పనులు చేపడుదామంటే ఆ బిల్లులు రావడం లేదు. దీంతో ఏం చేయాలో చేయని దిక్కుతోచని పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శులు ఉంటున్నారు. ఆయా మండలస్థాయి అధికారులకు తమకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతులు అందిస్తున్నారు.

నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు

జిల్లాలో 536 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో పదులసంఖ్యలో మేజర్ గ్రామపంచాయతీలు, వందల సంఖ్యలో చిన్న గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌ల పదవికాలం ముగిసిన వెంటనే ప్రభుత్వం పలుశాఖలోని సీనియర్ అధికారులను గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో కేంద్రప్రభుత్వం జనాభా ప్రతిపాదికన విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతినెల రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు ఆగిపోయాయి. అయితే 2024 సెప్టెంబర్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం కింద ప్రతి పంచాయతీకి రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేసింది. దీంతో కొంతమేర ఆర్థిక వెసులు బాటు కలుగుతుందని భావించిన పంచాయతీ కార్యదర్శులు, ఆచెక్‌లను ట్రెజరీలో జమ చేశారు. చెక్‌లు పాస్‌కావడం లేదని అకౌంట్లు ఫ్రీజింగ్ ఉన్నాయని వాపోతున్నారు.

పన్నులు వసూలైనా.. ఫ్రీజింగ్‌తో సమస్య

మేజర్ పంచాయతీలతో పాటు పరిశ్రమలు ఉన్న గ్రామాల్లో ఫ్యాక్టరీల నుంచి వచ్చే సెస్, వృత్తిపన్నులు, షాపుల అద్దెలు, లైసెన్స్ ఫీజులు, ఇంటి పన్నులు, ఇతర ట్యాక్స్‌లు వసూళ్లు అయినప్పటికి వాటిని నేరుగా ఖర్చుచేయడానికి వీల్లేదు. వాటిని సైతం ట్రెజరీలో జమచేశాక పంచాయతీ అకౌంట్ నుంచి చెక్‌రూపంలో ఆన్‌లైన్ ద్వారా డ్రా చేసుకోవాలి. కాని ట్రెజరీలో జమ చేసిన వెంటనే అకౌంట్‌ఫ్రీజింగ్ వస్తోందని దీంతో పన్నులు వసూలైనా గ్రామాల్లో సైతం ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్ల డీజిల్, వీధిలైట్ల ఏర్పాటు, పారిశుధ్యం, బ్లీచింగ్ పౌడర్, నల్లాల లీకేజీలకు మరమ్మతులు ఇలా గ్రామాల్లో అత్యవసరం కోసం ఖర్చుచేసి ప్రతి పైసా పంచాయతీ కార్యదర్శి భరించాల్సి వస్తోంది. ఇటీవల సీఎం ఆదేశాలతో క్షేత్రస్థాయిలో కలెక్టర్‌లు, ఉన్నతాధికారులు పర్యటిస్తున్నారు. ఏదో గ్రామాన్ని సందర్శించినప్పుడు ఏదైన సమస్య కనిపించిన కార్యదర్శులకు త్వరగా సమస్య పరిష్కారించాలని సూచిస్తుండడంతో ఎక్కడ నుంచి డబ్బులుతీసుకుని వచ్చి పనులు చేయించాలని అటు అధికారులతో చెప్పలేక ఇటు పనులు చేయలేక నానా అవస్థలు పడుతున్నారు.

పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి



చందూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో భాగంగా ఆదివారం చందూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ గార్లే ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజాసింగ్, శ్రీనివాస్, సాయిరెడ్డి, గణేష్ సింగ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు సరికాదు



ఏర్గట్లలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఏర్గట్ల,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):బీఆర్‌ఎస్ హయాంలో ఆరు వేలకు ఒక ఇసుక ట్రాక్టర్‌కు తీసుకున్నారని పదే పదే కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీపై నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం,మాజీఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అన్నారు.గత బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి జరిగిందో.. ఇప్పుడు కాంగ్రెస్ హయాం లో అవినీతి జరుగుతుందో తెలంగాణ తల్లి వద్దకు బహి రంగ చర్చ కు రావాలన్నారు.ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, బర్మ చిన్న నర్సయ్య,మాజీ ఎంపిటీసి జక్కని మధు, బీఆర్‌ఎస్ నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి రాజేందర్, ఎండీ అశ్రఫ్, జైనోద్దీన్, లక్కం నర్సయ్య, రొక్కెడ మోహ న్‌లు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలను పర్యవేక్షించిన సబ్‌కలెక్టర్



పరీక్ష కేంద్రాలను సందర్శించిన సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఆదివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రవేశ పరీక్ష తీరును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యార్థులకు కల్పించిన వసతులపై ఆరాతీశారు. టీజీ సెట్ అడ్మిషన్-2025 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు గురుకుల ప్రవేశ పరీక్షను పర్యవేక్షించారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులున్నారు.

నవీపేటలో పెద్దమ్మ తల్లికి బోనాలు



నవీపేటలో బోనాలు ఎత్తుకున్న భక్తులు

నవీపేట,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులు తలపైబోనాలు ఎత్తుకుని ఆలయానికి తరలివెళ్లారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మోస్రా,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ పాఠశాలకు చెందిన 12సంవత్సరాల విద్యార్థి ప్రభాస్ అకాల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఆదివారం బీజేపీ నాయకులు కోనేరు శశాంక్ పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చి 5 వేల రూపాయల ఆర్థిక సహయం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శశాంక్ మాట్లాడుతూ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహయం అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థుల ఫేర్‌వెల్

ముప్కాల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా ఫెర్వేల్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాండురంగ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు చేయగా పలువురిని ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల జోనల్ మేనేజర్ సంపత్ కుమార్, పాఠశాల డైరెక్టర్ లు ఆకుల లక్ష్మణ్, విగ్నేశ్వర్, సురేష్, రవి, ఆర్మూర్, బాల్కొండ ప్రిన్సిపాల్‌లు మీనాజ్, విజయ్ కర్తన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

● నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్రం మోసం చేస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న జిల్లా మాజీ సీపీ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్రంలో 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేస్తుందని, బీజేపీ జూట మాటలు నమ్మవద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరు నరేందర్ రెడ్డికి బోధన్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేస్తుందని, కుల, మతాల పేరిట బీజేపీ రాజకీయం చేస్తుందని ఆయన ఆరోపించారు. కుల, మతాల పేరిట రాజకీయం చేసే వారికి ఓటు వేయవవద్దని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, గడుగు గంగాధర్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు పాషా మొయినోద్దీన్, బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, శరత్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్లంలతో వివిధ పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించాలి

రెంజల్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వుట్కూరు నరేందర్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. ఆదివారం మండలంలోని నీలా, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాలలో పట్టభద్రుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని, నరేందర్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సాయారెడ్డి, గాయాసోద్దీన్, రవి, రవీంద్ర బాబు, జలీల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:జ్ఞానవంతులు, విజ్ఞులైన పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీని బలపర్చిన ఉట్నూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నిజామాబాద్ మాజీ సీపీ, వర్ధన్నపేట ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు నాగరాజు అన్నారు. ఆదివారం మోర్తాడ్ శివారులోని లలిత గార్డెన్‌లో బాల్కొండ నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణను ఆంధ్రవాళ్లు దోచుకున్న దాని కంటే అంతకంటే ఎక్కువ పదేళ్లలో దోచుకున్నారని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. రాష్ట్రాన్ని దివాల తీయించిన సీఎం రేవంత్‌రెడ్డి 55వేల ఉద్యోగాలు ఇచ్చారని, కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు తిరస్కరించిన ఇంక సోయిలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. జిల్లాతో తనకు అనుబంధం ఉందని, జిల్లాకు ఎన్నికల పరిశీలకుడిగా రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందనారు. పట్టభద్రులు, పట్టభద్రులైన యువకులు, మహిళలు కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను గమనించి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈరవత్రి అనిల్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ ప్రసంగించగా రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ రొక్కం మురళీ, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మహిపాల్, ప్రణీత్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, పట్టభద్రులు,పాల్గొన్నారు.

కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

డిచ్‌పల్లి: పట్టభద్రుల సంక్షేమం నిరుద్యోగులకు ఉపాధి కల్పన సమాజాభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ అధిష్టానం ప్రణాళిక తో ముందుకు వెళ్తుందని ఈ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ని పట్టభద్రులు తమ ఓటు వేసి గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేశ్ రెడ్డి కోరారు. అభ్యర్థి విజయం సాధిస్తే విద్యరంగంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధి, పాత పెన్షన్ విధానం, అంతర్జాతీయ క్రీడ ప్రాంగణం , ప్రైవేట్ విద్యాసంస్థల ఉద్యోగులకు అండగా ఉంటారని తెలిపారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు చిన్నోళ్ల నర్సయ్య, పెద్దోళ్ల శ్రీను, గంగారెడ్డి, మధుసుదన్, సాయిలు పాల్గొన్నారు.

● నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తున్నా ప్రభుత్వం

ఆర్మూర్‌రూరల్: నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో భాగంగా పట్టాబధ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రబుత్వానికి పట్టభ ద్రులకు వారదిగా ఉండి పట్టాభద్రుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసే నరేంధర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, రాష్ట్ర ఉర్దు అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, మారచంద్రమోహన్, యాల్ల సాయిరెడ్డి, రవిగౌడ్, ఏఎంసీచైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్‌చైర్మన్ జీవన్, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

● భీమ్‌గల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

భీమ్‌గల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచా రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేంధరరెడ్డి తరఫున మండల కాంగ్రెస్ నాయ కులు ఆదివారం పట్టణ కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్య మని, ఇందుకు శాసన మండలికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఈ సందర్భంగా పట్టభద్రులను కోరారు. ఈ ప్రచారంలో పార్టీ మండల అధ్య క్షుడు స్వామి, నర్సయ్య, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు అనంత్‌రావు, నాయ కులు కన్నె సురేందర్, వాక మహేష్, శ్రీనివాస్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి తాను సపోర్టు చేయడం లేదు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి తాను సపోర్టు చేయడం లేదని మాజీ డీఎస్పీ గంగాధర్ తెలిపారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా తాను నామినేషన్ వేసి ప్రచారంలో ఉండగా సీఎం కలవాలంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు నుంచి తనకు ఫోన్ వచ్చిందని వెంటనే సీఎం వద్దకు వెళ్లె కలవలేదని తెలిపారు. మరుసటి రోజు కలవడానికి వెళ్లగా హన్మంత్‌రావు తనను మంత్రి శ్రీధర్‌బాబు వద్దకు తీసుకెళ్లారని తనకు తెలియకుండానే కండువా కప్పి ఫోటోలు వైరల్ చేశారన్నారు. గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి సీఎం సుముఖంగా ఉన్నారని, కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయాలని సూచించారని తెలిపారు. స్వయంగా సీఎం నాయకులకు పరిచయం చే యిస్తారని పార్టీలో సముచిత స్థానం కల్పిస్తారని చెప్తే తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకున్నానని తెలిపారు. గడిచిన 10 రోజులుగా సీఎంను కలవడానికి ప్రయత్నిస్తున్న అపాయింట్‌మెంట్ దొరకడం లేదని తాను ప్యాకేజీతీసుకుని ఎన్నికల నుంచి తప్పుకున్నానని ప్రచారం జరుగుతుందని అందుకే ఆ వ్యాఖ్యలు నిజంకాదని మీడియా ముందుకు వచ్చినట్లు తెలిపారు. నరేందర్‌రెడ్డికి తాను సపోర్టుచేయడం లేదని కాంగ్రెస్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు.ఈ సమావేశంలో తెలంగాణ మాదిగ సంఘం మహాకూటమి చైర్మన్ కిరణ్‌మాదిగ, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కారేగాంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోటగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కారెగం శివారులో శ్రీశ్రీ స్వయంభు మహాదేవ ఆలయంలో ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. మూడు రోజుల క్రితం వివిధ పూజా కార్యక్రమాలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శివానంద్ శివాచార్య, సోమయప్ప, సద్గురు సోమలింగ శివాచార్య స్వామిజీ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తకంగా పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠాపించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బీబీపాటిల్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అఖండ నామస్మరణ, యాగశాల ప్రవేశం, మహా సుదర్శన హోమం, మహా చండీ హోమం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీగణపతి శివలింగ పార్వతి దేవి, నందీశ్వరుడు, దత్తాత్రేయ, పంచముఖి హనుమాన్, ధ్వజ స్తంభాణ, నవగ్రహాలు, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు కన్నుల పండువగా సాగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అంక్సాపూర్‌లో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాప మహోత్సవం

● హంపి వీరూపక్ష విద్యారణ్యభారతిస్వామి శ్రీ జగద్దురు శంకరచార్యలు చేతుల మీదగా ప్రతిష్ఠాపన



అంక్సాపూర్‌లో ..



ఆలయంలో దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న హంపి వీరూపక్ష విద్యారణ్యభారతిస్వామి

వేల్పూర్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో కొత్తగా నిర్మించిన హన్మాన్ ఆలయంలో ఆదివారం హంపి వీరూపక్ష విద్యారణ్యభారతిస్వామి శ్రీజగద్దురు శంకరచార్యలు చేతుల మీదుగా దాసాంజనేయ, నవగ్రహ శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగా వైభవంగా జరిగింది. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా - హంపి వీరూపక్ష విద్యారణ్యభారతి స్వామి శ్రీ జగద్దురు శంకరచార్యులు భక్తులకు ప్రవచనాలు చేశారు. ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని, ప్రతీరోజు ఉదయం లేవగానే దేవుని నామస్మరణ చేసుకోవాలన్నారు.ఆభగవంతున్ని ప్రతీరోజు కొలువడం వల్ల మనశ్శాంతి కలుగుతుందన్నారు. ఆలయానికి వెళ్లి మనసులోకి బాధలను తెలుపుతూ దేవున్ని వేడుకుంటూ బాధలు తొలగిపోతాయన్నారు. సృష్టికి మూలమైన భగవంతున్ని నియమ నిష్ఠలతో ఆరాదీస్తే అంత శుభమే జరుగుతుందన్నారు. భక్తిభావంతో జీవనాన్ని కొనసాగించిన వ్యక్తి పరామర్థం పొందవచ్చునన్నారు. ఉదయం ప్రతిష్ఠపన విగ్రహాలకు జలాభిషేకం నిర్వహిస్తూ పురోహితులు అవధాని సుదీర్‌శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చరణాల మధ్య ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఉషు పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాదవ్ గౌరిబాయి

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి):జక్రాన్‌పల్లిమండలం మునిపల్లి శివారులోని మహాత్మజ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల విద్యార్థిని జాదవ్ గౌరి బాయి ఉషు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ పరుచూరి అనూష తెలిపారు. ఇటీవల ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండి యా అచ్యూర్ ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉషు పోటీలలో తమకళాశాల విద్యార్థిని జాదవ్ గౌరి బాయి సీనియర్ మహి ళల విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించారన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిని సౌత్ జోన్ పోటీలకు ఎంపికైందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతి భ చూపిన జాదవ్‌గౌరిబాయిపూలే విద్యాసంస్థల కార్యదర్శి సైదు లు,రిజినల్ కోఆర్డినేటర్‌సత్యనాథ్,ప్రిన్సిపాల్‌అనుష,టీచర్లు అభినందించారు

కిడ్నీ సమస్య బాధితులకు ఎమ్మెల్సీ ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వార్డు నెంబర్ 12 శాంతినగర్‌లో గల శ్రీకాంత్, విజయ దంపతులకు మూడు నెలల చిన్న బాబు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడన్న విషయం తెలుసుకుని ఎమ్మెల్సీ కవిత రూ.25వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. నిజామాబాద్‌లోని ప్రగతి హస్పటల్‌లో సర్జరీ ఉండడం వల్ల బోధన్ బీఆర్‌ఎస్ నాయకులు పెర్క రామకృష్ణ ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కవితను ఫోన్‌లో సమాచారం అందించడం జరిగిందని, వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ కవిత ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సహయం అందించడం జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. బాధిత కుటుంబం ఎమ్మెల్సీ కవితను కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థానంలో నిలవాలి



టీవీ ఆర్టిస్టులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ సుందర్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదతో చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని టీవీ ఆర్టిస్టు జబర్దస్ ఫేం సద్దం, పులి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో శ్రీబాషిత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జబర్దస్త్ ఫేం సద్దాం, పులిలు హాజరయ్యారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి చదువు చాలా ముఖ్యమైందని, చదువుతోనే ఏదైన సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్ర మాలు తోటి విద్యార్థులను అలరించాయి. విద్యార్థులకు వివిధ పోటీలకు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రావూజీ సంఘం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నగరంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):నగరంలోని నాందేవ్ వాడలోగల రావూజీ వంజరి సంఘం ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల క్రితం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులంతా సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనాడు చదువు చెప్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకొని ఉలాసంగా గడిపారు. 25 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒక్కచోట చేరడంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కృష్ణసాయి, అర్వింద్, కన్న, రవి, నర్సాగౌడ్, నిచ్చెంగ్ కృష్ణ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 23: (ఆంధ్రజ్యోతి) మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99 విద్యాసంవత్సరం పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా గత 26 సంవత్సరాల తరువాత అందరు ఒక చోట చేరి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకున్నారు. ఎప్పుడో విడిపోయి ఇప్పుడు ఇలా కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆదివారం పాఠశాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులు గతంలో చదువుకున్న పాఠశాల గదిలో కూర్చుని పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న పనులు, ఉద్యోగాలు తదితర విషయాలను ఒకరినొకరు పంచుకున్నారు. కార్యక్రమానికి హాజరైన తమకు విద్యాబుద్దులు నేర్పిన అప్పటి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ఉపాధ్యాయులు పడాల సుదర్శన్, రాజగౌడ్, రవిందర్, శంకర్‌లను ఘనంగా సన్మానించుకునివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అంతకు ముందు అసువులు బాసిన ఉపాధ్యాయులు నారాయణ రావు, గంగారెడ్డి, ఎస్‌కే దావూద్, గోపాల్‌రెడ్డిలను తలుచుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఆత్మశాంతికై మౌనంపాటించారు. కార్యక్రమం అనంతరం అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆడీపాడారు.

కోటగిరిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోటగిరిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. (2001 -22) బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు 23 ఏళ్ల అనంతరం ఒకే చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకోని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాడు పాఠశాలలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో కలిసి గడిపిన క్షణాలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో తమకు విద్యార్థులు నేర్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రావు, పూర్వ ఉపాధ్యాయులు వరకుమారి, ఆశా జ్యోతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

బర్డ్‌ఫ్లూ ప్రబలకుండా చర్యలు

● నిజాంసాగర్ ఉమ్మడి మండల పశువైద్యాధికారి యూనూస్



నిజాంసాగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ ప్రబలకుండా ఉమ్మడి మండలాలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని నిజాంసాగర్ ఉమ్మడి మండల పశువైద్యాధికారి డాక్టర్ యూనూస్ తెలిపారు. చికెన్ షాప్ యజమాన్‌లకు నోటీసులు జారీ చేశామని, పౌల్ట్రీఫారంలున్న గ్రామాలను గుర్తించి యజమాన్‌లకు పౌల్ట్రీలు శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో ఎన్ని పౌల్ట్రీ ఫారాలున్నాయి. ఒక్కో ఫారంలో ఎన్ని కోడి పిల్లలను పోషణ చేస్తారు?

పశువైద్యాధికారి: నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో 14 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. ఒక్కో ఫారంలో 5వేల చొప్పున కోడిపిల్లలు పోషణ జరుగుతుంది. ఈ ఫారాలలో 70 వేల కోడి పిల్లలు వేస్తారు.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి మండలాల్లో ఉన్న పౌల్ట్రీ ఫారాలలో ఇప్పటి వరకు కోళ్లు ఎన్ని చనిపోయాయి?

పశువైద్యాధికారి: ఉమ్మడి మండలంలో ఇప్పటివరకు ఏ ఒక్క ఫారంలో కోళ్లు చనిపోలేదు. ఒకవేళ పౌల్ట్రీ ఫారంలో 200 నుంచి 400 కోళ్లు చనిపోయినట్లయితే బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిందా అని నిర్ధారణ చేసి చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి మండలంలో దళితబంధు పథకం కింద ఏ గ్రామాల్లో పౌల్ట్రీ ఫారంలు వేశారు. అవి ఏ విధంగా కొనసాగుతున్నాయి?

పశువైద్యాధికారి: ఉమ్మడి మండలంలో దళితబంధు పథకం కిందట ఐదు పౌల్ట్రీ ఫారాలున్నాయి. మహ్మద్‌నగర్ మండలంలో గున్కుల్, మద్దూర్, గాలిపూర్ గ్రామాలలో మొత్తం నాలుగు ఉన్నాయి. నిజాంసాగర్ మండలంలో మల్లూరు గ్రామంలో ఉన్నాయి. ప్రస్తుతం పౌల్ట్రీ ఫారాలు విజయవంతంగా నడుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి మండలంలో ఉన్న పౌల్ట్రీ ఫారంలా యజమానులకు బర్డ్ ఫ్లూ సోకకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలని సూచించారు?

పశువైద్యాధికారి: పౌల్ట్రీ ఫారంలో యజమానులకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుండా పౌల్ట్రీలను శుభ్రంగా ఉంచడంతోపాటు కొత్త వారిని పనిలో పెట్టుకోవద్దని సూచించాం. వ్యాధి పట్ల సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గొర్రె, మేకలు పశు జాతి బర్రె జాతులు ఎన్ని ఉన్నాయి? గాలికుంటు వ్యాధికి టీకాలు వేసే ప్రణాళికలు రూపొందించారా?

పశువైద్యాధికారి: ఉమ్మడి మండలంలో 16,806, గొర్రెలు 9,614 మేకలు, 7,900 పశు జాతి బర్రె జాతులు ఉన్నాయి. వీటికి గాలికుంట వ్యాధి సోకకుండా త్వరలో టీకాలు వేయనున్నాం.

ఆంధ్రజ్యోతి: చికెన్ సెంటర్ల నిర్వాహకులకు బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించారా?

పశువైద్యాధికారి: చికెన్ సెంటర్లు నిర్వహిస్తున్న యజమానులకు బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించాం. చనిపోయిన కోళ్లను చికెన్ సెంటర్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.

ఆదర్శ వివాహాలకు ప్రోత్సాహం

అందని ద్రాక్షే!



● నాలుగేళ్లుగా నిధుల కోసం నిరీక్షణ ● ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న దంపతులు

● జిల్లాలో 200 జంటలకు అందని ప్రోత్సాహకం

ఆంధ్రజ్యోతి ఫోకస్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. షెడ్యూల్ కులానికి చెందిన అబ్బాయి లేదా అమ్మాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే వారికి షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. ఇదివరకు రూ. 50వేలు ఉన్న ఆర్థిక సహాయం గత ప్రభుత్వం 2019 నవంబర్ 1న రూ. 2లక్షల 50వేలకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. కాని ఆ ఉత్తర్వులు ఇచ్చినప్పటి నుంచి ఆదర్శ దంపతులకు సంబంధించి ప్రోత్సాహకాలకు నిధులను విడుదల చేయడం లేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సహాయం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు.

290కి పైగా దంపతులు దరఖాస్తులు

గత నాలుగేళ్లుగా జిల్లాలో 290కి పైగా దంపతులు దరఖాస్తులు చేసుకోగా కేవలం 90 మందికి మాత్రమే ఆర్థిక సహాయం అందింది. ఇంకా 200 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి ఆర్థిక సహాయం అందాల్సి ఉంది. గతంలో ఉన్న ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం పెంచినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఆదర్శ వివాహాలు చేసుకున్న జంటలకు ఆర్థిక సహాయం మాత్రం అందలేదు. సమాజంలో ఉన్న కుల రుగ్మతలను తొలగించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకానికి నిధుల కొరత ఇబ్బందులను కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రోత్సాహకాన్ని పెంచినప్పటికీ నిధులు విడుదల చేయలేదు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా నిధులు విడుదల చేయాలని ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులు కోరుతున్నారు. గత 14 నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

అర్హులు వీరే..

ఆదర్శ కులాంతర వివాహాలు చేసుకున్నవారు ఆర్థిక సహాయం పొందాలంటే ఈ కింది అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పనిసరిగా షెడ్యూల్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందినవారు ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు ఖచ్చితంగా నిండి ఉండాలి. వివాహ చట్టం 1965 కింద రిజిస్టర్ అయి ఉండాలి. పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ.5లక్షల కంటే తక్కువగా ఉండాలి. మొదటి పెళ్లికి మాత్రమే ఈ ప్రోత్సాహకం అందుతోంది. వివాహం అయిన ఏడాదిలోగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సహాయం అందుతోంది.

నిధులు రాగానే.. సహాయం అందిస్తాం

● నిర్మల, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని 2019 నవంబర్ నుంచి రూ.2.5 లక్షలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో తల్లిదండ్రుల మద్దతు లేని జంటలు జీవితంలో స్థిరపడేలా కృషిచేస్తున్నాం. దీనిపైన అవగాహన కల్పించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

అవసరమైన ధ్రువీకరణ పత్రాలు

వేర్వేరు కులానికి చెందిన యువతీ, యువకుడు వివాహం చేసుకుంటే పెళ్లికి సంబంధించిన ఆధారాలతో షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత శాఖ అధికారులు విచారణ నిర్వహించి అర్హులు అని తేలితే ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. వివాహం చేసుకున్న దంపతులు మూడు ఫొటోలు, కుల, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, విద్యాసంస్థల నుంచి తీసుకున్న టీసీ, మార్కుల జాబితా, వివాహం చేయించిన అధికారి ధృవీకరణ పత్రం, గెజిటెడ్ అధికారి నుంచి పొందిన ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్, దంపతులు కలిసితీసిన బ్యాంక్ అకౌంట్ వివరాలను అందజేయాలి. వివాహానికి సాక్షుల వివరాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, దరఖాస్తుతో పాటు జతచేయాల్సి ఉంటుంది.

దరఖాస్తులు ఎక్కువ నిధులు తక్కువ

జిల్లాలో 2019 నుంచి 290కి పైగా దరఖాస్తులు రాగా 90 జంటలకు ఆర్థికసహాయం ఇచ్చారు. ఇంకా 200 జంటలకు ఆర్థిక సహాయం అందాల్సి ఉంది. ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా రూ.లక్షా 16 వేలు అందిస్తుండటంతో కులాలు వేరైనా పెద్దలు ఒప్పుకొని పెళ్లి చేసుకున్న జంటలు కల్యాణలక్ష్మి వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు పెళ్లిళ్లు చేసుకున్న రోజుల నుంచి క్రమంగా కులమతాలు వేరైనా అభిరుచులు కలిస్తేచాలు పెళ్లిళ్లు చేసుకునేవారు. ఆర్థికసహాయం ఆలస్యం అవుతుండటంతో పెద్దల అనుమతితో పెళ్లిళ్లు చేసుకున్నవారు కల్యాణలక్ష్మి వైపు మొగ్గు చూపుతున్నారు.



మురుగు కాల్వలపై పిచ్చిమొక్కలు

అస్తవ్యస్తంగా మురుగు కాల్వలు

● ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

● పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పారిశుధ్య పనులు పడకేశాయి. మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో పలు కాలనీలు కంపు కొడుతున్నాయి. మురగు కాలువలు పూర్తిగా నిండిపోయి దోమల బెడద పెరిగినా అధికారులు పట్టించుకోడం లేదు. ప్రధానంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల ముగురు కాలువ వద్ద కల్వర్టు పూర్తిగా మురుగు నీటితో నిండిపోయి కల్వర్టు మూసుకుపోయింది. పక్కనే గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల డ్రైనేజీపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మురుగు నీరు మొత్తం అక్కడే నిలిచి రోడ్డుపైకి పారుతోంది. అలాగే ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డును ఆనుకొని మూత్రశాలలు ఉండటంతో మురుగు కాలువలో కంపు కొడుతూ దోమల బెడత పెరగడంతో వ్యాపారస్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జీపీ అధికారులు స్పందించి మురుగు కాలువను గుర్తించి పూడిక తీసి దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు.



చేపలకు పెరిగిన గిరాకీ

ధర్పల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోళ్లకు బ్లడ్ ఫ్యూ వ్యాధి కారణంగా చేపలకు, మాంసానికి డిమాండ్ పెరిగింది. దీంతో మార్కెట్‌లో చేపలు, మాంసం కోసం ప్రజలు క్యూ కడుతున్నారు. మరోవైపు బ్లడ్‌ఫ్లూ కారణంగా చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. కొందరైతే తమ షాపులను మూసివేసుకుంటున్నారు. మరోవైపు కోడిగుడ్లు సైతం తినడానికి ప్రజలు జంకుతున్నారు. ఇదే అదనుగా చేసుకొని మార్కెట్‌లో చేపలు, మాంసం ధరలను అమాంతం పెంచేశారు. చికెన్ ధర రూ.100 నుంచి రూ.130 వరకు విక్రయిస్తుండగా అయినా కూడా చికెన్ కొనడానికి ప్రజలు అయిష్టంగా ఉన్నారు. ఆదివారం కావడంతో చేపల మార్కెట్‌లో కొనుగోళ్లతో కలకలలాడాయి. దాదాపు నెల రోజులుగా విక్రయాలు లేవని తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు చికెన్ షాపు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లడ్ ఫ్లూ కారణంగా చికెన్ తీసుకోవడానికి ప్రజలు జంకుతున్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.



కొచ్చేరి మైసమ్మ గుడిలో భక్తులు



కందకుర్తి గోదావరి వద్ద భక్తుల సందడి

కందకుర్తికి భక్తుల తాకిడి

రెంజల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం ఆదివారం భక్తులతో కొత్త కళను సంతరించుకుంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుని ముందస్తుగా భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుని పూజలు నిర్వహించారు. ప్రతీఏటా మహరాష్ట్ర శివరాత్రికి ముందు వచ్చే ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో కందకుర్తి గోదావరిలో నదిలో స్నానాలు ఆచరించి స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రిమాసం కావడంతో శివుడికి పూజలు చేస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులు గోదావరి జలాలతో శివుడికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కందకుర్తి గోదావరి త్రివేణి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.



గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

హరిహర క్షేత్రం.. పోచంపాడ్

● శ్రీరాముడు నడయాడిన నేల ● ప్రాశస్త్యం కలిగిన శివాలయం ● మహా శివరాత్రికి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి

భక్తి



ఆలయ ఉత్సవమూర్తులు

మెండోర, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో రెండోకాశీగా ప్రసిద్ధిచెందిన హరిహర సుతుడు, సీతారామ లక్ష్మణ సహితుడు కొలువైన క్షేత్రం పోచంపాడ్ గ్రామం. పవిత్ర గౌతమ నదీతీరాన వెలిసిన శివాలయం శ్రీకోదండ రామాలయం. పోచంపాడ్ గ్రామానికి వన్నె తెచ్చాయి. ఎంతో ప్రాశస్త్యం కలిగిన శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. శ్రీరాముడు వనవాసం సమయంలో ఈ ప్రాంతంలో సంచరించడతో ఈప్రాంతం శ్రీరాముని పాదస్పర్శతో పుణితం అయిందని భక్తులు ప్రగాఢ విశ్వాసం. పురాణాల ప్రకారం శివాలయం విశిష్టత ఈ విధంగా ఉంది. తండ్రికి ఇచ్చిన మాట కోసం శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసం సమయంలో గోదావరి నది వెంబడి సంచరించినట్టు ఇక్కడి ఆనవాళ్లు తెలుపుతున్నాయి. శ్రీరాముడు వనవాసం చేస్తున్న సమయంలో కుస్తాపురం (ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో మునిగిపోయింది) గ్రామంలోని గోదావరి నది చేరుకోగానే వశిష్ఠ మహర్షి సూచన మేరకు బ్రహ్మ హత్య పాపా విముక్తి కోసం శ్రీరాముడిని కాశిలో నుంచి సువర్ణ లింగాన్ని తెచ్చి పూజించాలి సూచిస్తారు. వెంటనే హనుమంతుని సువర్ణ లింగాన్ని తెవాల్సిందిగా ఆదేశిస్తాడు. సమయం దగ్గరపడుతున్న హనుమంతుడు రాకపోవడంతో వశిష్ఠ మహర్షి సూచన మేరకు గోదావరిలో నుంచి ఇసుకను తీసుకొని లింగాన్ని ప్రతిష్ఠించాలని కోరగా శ్రీరాముడు ఇసుక లింగాన్ని ప్రతిష్ఠించినట్టు పురాణాలు చెబుతున్నాయి. కాలక్రమేన శివలింగానికి కూస్తపురం గ్రామస్థులు ఆలయాన్ని నిర్మించారు. (ప్రస్తుతం ఎస్సారెస్పీలో మునిగిపోయింది.) శివాలయంలో నందీశ్వరుని విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయించారు.

సాల గ్రామ నందీశ్వరుడు

పోచంపాడ్‌లోని ఆలయంలో కొలువైన నందీసాల గ్రామ నందీశ్వరుడు కావడంతో ఆలయంమరింత ప్రాధాన్యం సంచరించుకుంది. నందీశ్వరునికి సంబంధించిన ప్రాశస్త్యం ఇలా ఉంది. ఆలయంలోని నందీశ్వరుడు రాత్రి వేళల్లో నిజస్వరూపం ధరించి ఆలయం నుంచి బయటకు వెళ్లి రైతులకు సంబంధించిన పంటపొలాలను మెసెది తెల్లవారుజామున తిరిగి గుడిలోకి చేరుకొని విగ్రహముగా మారేది అని పురాణిలు తెలుపుతున్నాయి. ఒక రోజు కుస్తపురం గ్రామస్థులు తమ పంట పొలాలను నాశనం అవుతున్నాయి అని గ్రహించి రాత్రి వేళలోల పంట పొలంలో కాపలాకు వెళ్లారు. యాథావిధిగా నందీశ్వరుడు నిజస్వరూపం ధరించి ఆలయం నుంచి బయలుదేరి పంట పొలాల వైపు వెళ్ళగా విషయం తెలియని గ్రామస్థులు నందీశ్వరుని పట్టుకొని గంగాడోలు చెవులను కోసి వేశారు. అప్పుడే నందీశ్వరుడు సాల గ్రామ నందీశ్వరుడిగా అవతరించాడు. తిరిగి నందీశ్వరునిని తీసుకొని వచ్చి పోచంపాడ్ శివాలయంలో ప్రతిష్ఠించారు. కాలక్రమేన కుస్తపురం గ్రామం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో మునిగిపోవడంతో అనంతరం పోచంపాడ్ గ్రామంలో నూతనంగా శివాలయం, కోదండ రామాలయంను నిర్మించారు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగాన్ని తీసుకువచ్చి ప్రతిష్ఠించాలని చూడగా సాధ్యం కాకపోవడంతో కాశి నుంచి శివలింగాన్ని తెప్పించి హింపీ విరూపాక్షా నరసింహభారతిస్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. నందీశ్వరుని కూస్తపురం గ్రామం నుంచి తీసుకువచ్చి ప్రస్తుత శివాలయంలో ప్రతిష్ఠించారు. ఈ నందిని సాల గ్రామ నందీశ్వరునిగా ఇప్పటికి మనం చూడవచ్చు.

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

మహాశివరాత్రి ఉత్సవంలో అన్నిఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తుల సౌకర్యం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను చేశారు. జాగరణ కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో పూజ కార్యక్రమాలు

- ఈనెల 25న మంగళవారం స్వామివారి సుప్రభాతసేవ, గోపూజ, గణపతిపూజ, కలశాలతో పంచామృతలతో అభిషేకం, బేరిపూజ, దేవతహ్వానం.
- 26న బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రీరామ లింగేశ్వరస్వామికి మహాన్యాసా పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం తెప్పోస్సవం. వేదబ్రహ్మణులచే వృసభ ధ్వజహరణం పూజ యాగవిధి ప్రధాన హోమం, ఎదురొకలు, నవాధాన్యంలచే మహాపూజ.
- 27న గురువారం రథోత్సవం, 28న శుక్రవారం అమవాస్య రోజున తీర్థరాజ పూజ పాతర రౌపురసం ఏకాదశ రుద్రా కలశ స్థాపనం, ఏకాదశి రుద్రాభిషేకం. ఉపసనం. బలిహారణ హారతి.
- మార్చి 1న శనివారం పాల్గుణ ప్రతిపద ఔషాపునం బలిహరణం శేష హోమం, నాకబలి పుష్పఆగం, క్షేత్రపాలిక బాలి పూర్ణాహుతి కార్యక్రమాలు వుంటాయని ఆలయ కమిటీ వారు తెలిపారు.



పోచంపాడ్ శివాలయం ఇదే..



సాల గ్రామ నందీశ్వరుడు



ఆలయంలో కొలువైన శివలింగం

ఎమ్మెల్సీ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకుల ప్రచారం



గొల్లపల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ కోసం ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కరీంనగర్, మెదక్, అదిలాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డి గెలిపించాలని రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిషన్, మహేష్, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

రామారెడ్డి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కు ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడి గంటలు ఆలయ కమిటీ చైర్మెన్ నారెడ్డి మహిపాల్ రెడ్డి నేతృత్వంలో ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆలయానికి తప్పకుండా వస్తానని చెప్పినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు టంకరి రవి, మాజీ రైతు బంధు అధ్యక్షుడు తిరుపతి, నాయకులు టంకరి రాజేందర్, కమ్మరి బాల్ రాజు, బండి శ్రీకాంత్, కోమటి నరేష్, బలగం లింగం, తెడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి మాజీ సర్పంచ్ ఆర్థిక సాయం

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి నివాసపు పూరి గుడిసె దగ్ధమై భారీ ఆస్తి నష్టం జరిగిన బాధితురాలు పుల్ల మణెమ్మకు ఆదివారం నాగిరెడ్డిపేట మాజీసర్పంచ్ విట్టల్ రెడ్డి ఐదు వేల రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విట్టల్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మణెమ్మ ఇంటికి వెళ్లి ఆమెను ఓదార్చి తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. బాధితురాలి కుటుంబానికి తాము అండగా నిలుస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ ఠాగూర్, ఇమామ్, సుధాకర్, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

జాడలేని ఫాగింగ్



పేరుకుపోయిన మురికి కాలువ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో ఫాగింగ్ జాడలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కుడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో పట్టణ ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికా రుల నిర్లక్ష్యం సిబ్బంది అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మున్సిపా లిటీలో విలీనమైన గ్రామాలతో పాటు పట్టణ కేంద్రంలోని ప్రధాన రహ దారి పక్కన వార్డులలో దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేవని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా రోజుల నుంచి ఫాగింగ్ మాటే లేదు, చీకటి పడితే కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు, వీటిని అదుపు చేయకపోవడంతో మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు వెంటాడుతున్నాయని బాధితులు వాపోతున్నారు. మురికి కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోయి, మురికి నీరు నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అదేవిధంగా ఖాళీ ప్రదేశాలలో పిచ్చి మొక్కలు శుభ్రత లేకపోవడం చెత్తాచెదారంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణ కేంద్రంతోపాటు విలీనమైన ప్రాంతాలలో మురికి కాల్వలు శుభ్రం చేసి, ఫాగింగ్ కొట్టి ప్రజలను విషజ్వరాల భారీ నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

లొంకరామలింగేశ్వర స్వామి పోస్టర్ల ఆవిష్కరణ

సిరికొండ ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి) సిరికొండ సమీపాన గల అడవి లో కొలువు దీరిన శ్రీలొం క రామ లింగేశ్వర ఆలాయం వద్ద నూతనంగి నిర్మించనున్న త్రీతల రాజగోపురం పోస్టర్లను నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు.ఈ నెల 26 నుండి 28 వరకు జరిగే జాతర ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను ఆలాయ కమిటీ సభ్యులు కోరారు. డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ లొంక రామ లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడు సహకరి స్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు దేగం సాయన్న, దుప్పూరి భాస్కర్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు సంతోష్,బోయిడి ప్రకాష్, దాసరి మారుతి, పారిపల్లి బీనీల్ తదిత రులు పాల్గొన్నారు. లొంక రామ లింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ప్రభు త్వం ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి రూ.మూడు కోట్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేగం సాయన్న తెలిపారు. ఈ నిధులతో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చేపడుతారని ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడి మృతి

ఎడపల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో గల డి46 కెనాల్‌లో జారిపడి వినోద్ అనే యువకుడు మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన వినోద్ అను అతను గత 3 రోజుల క్రితం ఏఆర్పీ గ్రామ శివారులోని ఇటుక బట్టీలో కూలీపని నిమిత్తం వచ్చాడని ఆదివారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లి నిజాంసాగర్ కెనాల్‌లో జారిపడి శ్వాస ఆడక చనిపోయాదని తెలిపారు.

రోడ్డు మరమ్మతు చేయించిన ఎమ్మెల్యే



ఇసన్నపల్లి - మద్దికుంట రోడ్డ మరమ్మతు చేయిస్తున్న నాయకులు

రామారెడ్డి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం ఇసన్నపల్లి - మద్దికుంట గ్రామానికి వెళ్లే రోడ్డు చెడిపోయిన విషయం తెలిసిందే. ఆదివారం ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనానికి కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం బిజెపి నాయకులు రోడ్డుపై మొరం పోయించారు. బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. రెండు గ్రామాల శివారులోని రోడ్డుపై మొరం పోయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ట్రాక్టర్లపై మొరం తెప్పించి రోడ్ల మరమ్మతుకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి కృషిచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమ్మరి రాజశేఖర్, రాజు, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల తరపున బీజేపీ నాయకుల ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపీ జిల్లా అధ్యక్షులు

రాజంపేట,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డి తరఫున బీజేపీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్‌జైన్ మాట్లాడుతూ అబద్దపు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, పట్టభద్రులు బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో బీజేపీ గెలువడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు పిట్ల శ్రీనివాస్, రాజంపేట, పట్టణ అధ్యక్షుడు రాము,నాయకులు నవీన్, నరేష్,చారీ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : బీజేపీ సిద్ధాంతాలకు నాయకులు, కార్యకర్తలు కట్టుబడి ఉంటారని కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు నీలంచిన్న రాజులు అన్నారు. ఆదివారం పిట్లంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఈనెల 20న పిట్లంలో బిజెపీపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ప్రచారం నిర్వహించిన విషయం తెలసిందె, ఓపత్రికలో విలేఖరి తనకు నచ్చిన విదంగా కార్యకర్తల మనోబావాలు దిబ్బతినె విదంగా పార్టీ ప్రతిష్టను దెబ్బతినె విదంగా వార్తను రాయడం జరిగిందన్నారు.బిజెపీ నాయకులు అందరు కలిసి పోలీస్‌స్టెషన్‌లో తప్పుడు వార్తను వ్రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని పిర్యాదు చెశారు.ఈకార్యక్రమంలో జిల్లా ప్రదానకార్యదర్శి కాల్లకుంట్ల రాము, జుక్కల్ ప్రబారి రవికుమార్‌గౌడ్, నాయకులు తుకరాం, ప్రసంగిత్‌కాలె, సాయిరెడ్డి, రాజు, అశోక్‌రాజ్, బాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని భేతాళస్వామి కాలనీలో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. వేదపండితులు ఉదయం నుంచి వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన చేపట్టారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి భక్తుల నుద్దేశించి ప్రవచించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , కాలనీవాసులు , భక్తులు తదితరులున్నారు.

బీర్కూర్: శ్రీవారిని దర్శించుకునేందుకోసం వచ్చే భక్తులను కొండ కింది నుండి పై భాగానికి ఉచితంగా చేర్చేందు కోసం టీటీడీ వారు ఒక కొత్త వాహనాన్ని కొనుగోలు చేశారు. ఆదివారం ఆలయ ధర్మ కర్త, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని అన్నారు. అయితే భక్తులను అలిపిరి నుండి దేవస్థానం వరకు వాహనంలో ఉచితంగా తరలించేందుకు టీటీడీ వారు వాహనం కొనుగోలు చేశారన్నారు. వృద్దులు, మహిళలు, చిన్నారులు కింది నుంచి పైకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని కొత్త వాహనం కొనుగోలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టిస్నానంతో అనేక రోగాలు దూరం



మండలంలోని జంగంపల్లి చెరువులో మట్టి స్నానం చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మట్టి స్నానాన్ని ఆచరించడంతో అనేక రోగాలు ముఖ్యంగా చర్మవ్యాధులు నయమవుతాయని యోగగురువు రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జంగంపల్లి పెద్దచెరువులో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి స్నానాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయాప్రాంతాలక చెందిన 120మంది మట్టిస్నానం ఆచరించి పలు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మట్టి స్నానంతో అనేక చర్మ సంబంధిత వ్యాధులు, సోరియాసిస్, తెల్లమచ్చలు, మరెన్నో రోగాలను నయం చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో చైన్‌స్నాచింగ్



పరారైనా దొంగ ముఖచిత్రం సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి పారిపోతుండగా దొంగను పట్టుకుని గ్రామస్థులు చితకబాదిన సంఘటన భిక్కనూరు మండలంలోని బస్వాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన రేణమ్మ తన కొడుకు దగ్గరకు వెళ్తుండగా వివేకానందా విగ్రహం సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుండి బంగారు పుస్తెలతాడును తెంపుకుని వెళ్తుండగా గ్రామానికి చెందిన కొందరు యువకులు బైక్‌ను వెంటపడి బైక్‌పై వెనుకాల కూర్చున వ్యక్తిని పట్టుకోగా బైక్‌ను నడుపుతున్న వ్యక్తి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకుని గ్రామస్థులు అక్కడికి చేరుకుని పట్టుబడిని దొంగను చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దొంగ నుండి పుస్తెలతాడును రికవరి చేయ్యడం జరిగిందని, పరారైనా మరో దొంగను త్వరలోనే పట్టుకుంటామని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో టెండరు విడుదల



శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో టెండరు విడుదల చేస్తున్న దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో టెండర్ కొటేషన్‌లో ప్రక్రియ నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా ఆధ్వర్యంలో జరిగిన సీల్డ్‌కవర్సు విప్పడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలభైరవ స్వామి ఆలయ మాజీ చైర్మన్ కైలాస్ రాజేశ్వర్ రావు గుప్తా, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, రాజకీయ నాయకులు, వ్యాపారులు, ఆలయ సిబ్బంది నాగరాజు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొయ్యగుట్ట , బోర్లం గురుకుల పాఠశాలల్లో ఆదివారం ప్రవేశ పరీక్ష జరిగింది. కాగా ఈ పరీక్షా కేంద్రాలను బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మాయి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

పదోతరగతి విద్యార్థులకు ప్రతిభపరీక్ష

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష పత్రాన్ని ప్రముఖ న్యాయవాది సిద్దిరాములు, ఎస్ఐ బాల్‌రెడ్డిలు ఆవిష్కరించారు. విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించడం కోసం ఎస్ఎఫ్ఐ ఇలాంటి ప్రతిభ పరీక్షలు పెట్టడం అభినందనీయమని అన్నారు.ఇలాంటి ప్రతిభపరీక్షల వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన ఎంతగానో పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పరీక్షలు భవిష్యత్తులో ఎవరు నిర్వహించిన విద్యార్థులు పాల్గొనాలని అప్పుడే పరీక్షలంటే భయం తొలగిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్, ప్రధానకార్యదర్శి అరుణ్, సాందీపని కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులురాహుల్, నితిన్, మణికంఠ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ ముందు పూజలు... విచారణ జరిపిన పోలీసులు



దామరంచలో విచారణ చేపడుతున్న పోలీసులు

బీర్కూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరాంచ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు పూజలు చేస్తున్నారు. రోజుకో ఇంటి ముందు పసుపు, కుంకుమ, రక్తపు మరకలను, నిమ్మ కాయలు, పచ్చి మిర్చీలు, పిండితో తయారు చేసిన బొమ్మలు ఉంచి పూజలు చేస్తుండడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.. రాత్రి అయిందంటే చాలు ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉదయం లేచిచూసే సరికి గడప ముందు పూజలకు సంబంధించిన వస్తూ సామగ్రి కనపడుతుందని ప్రజలు తెలిపారు. వారం రోజులుగా రోజుకో ఇంటి ముందు పూజలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి గ్రామానికి చెందిన పోషవ్వ , రాములమ్మ ఇళ్ల ముందు పసుపు , కుంకుమ,రక్తపు మరక లను, నిమ్మ కాయలు, పచ్చి మిర్చీలు, పిండితో తయారు చేసిన బొమ్మ లు ఉంచి పూజలు చేసినట్లు బాధితులు వాపోయారు. సమా చారం అం దుకున్న పోలీసులు ఆదివారం దామరాంచకు చేరుకుని బాధితుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. చేతబడి చేస్తున్నారని గ్రామస్తులు భయాందోళన లకు గురయ్యారు.

ఎల్లమ్మ దేవాలయ బోనాల పండుగ

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):అమ్మ మమ్మల్ని చల్లగా చూడు తల్లి అని వేడుకుంటూ ఎల్లమ్మ అమ్మవారికి బోనాల పండు గను నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలోని ఎల్ల మ్మ దేవాలయంలో మాఘమాస బోనాల జాతరను ఘనంగా నిర్వహిం చారు. ఉదయం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను పెట్టి మహిళలు, సంఘ ప్రతినిధులు ప్రత్యేక పూ జలు జరి పారు. ఆలయం నుండి బోనాలను మంగళహారతులతో ఊరేగిం పుగా బ యలుదేరి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఊరేగింపు దారిపొడ వున భక్తులు కొబ్బరికాయలతో స్వాగతం పలికారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు,ఆయురారోగ్యంతో చల్లగా ఉండాలని వేడుకుంటూ అమ్మవారికి బోనాలను సమర్పించారు. మహిళలు బోనాలతో నెత్తినపెట్టుకొని అమ్మను ప్రార్థిస్తూ ముందుకు సాగి ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. ఎల్లమ్మగుట్టలో గల అతి పురాతనమైన ఎల్లమ్మ దేవాలయానికి ఎంతో విశిష్టత ఉందని ఆది పరాశక్తి ఎల్లమ్మగా భక్తులచే పూజలు అందుకుం టుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన బోనాల జాతరకు ముఖ్య అతిథిగా హాజరై బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని బోనాన్ని అందజేసినట్లు తెలి పారు. ఆలయంలో ప్రతియేటా మాఘమాసంలో వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజుల పాటు పూజలు, హోమాలు, నైవేద్యాలు సమర్పించుకోవడంతో పాటు తెలంగాణ సాంప్రదాయ సంస్కృతి అద్దం పట్టే విధంగా బోనాలను అందజేయడం జరుగుతుందని అన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో బుద్ది చెబుతాం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోతే వచ్చే పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఆ పథకాలపై ఆధారపడ్డ పేద మధ్యతరగతి విద్యార్థులు బకాయిలు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులకు చదువులు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని దీనివల్ల విద్యార్థులు పైచదువులు చదివేందుకు నష్టపో తున్నారని అన్నారు. వెంటనే నిధులను విడుదల చేయకపోతే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష



మద్నూర్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మద్నూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో 5వ తరగతి కామన్ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ గంగా కిషోర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంచే నిర్వహించబడిన 5వ తరగతి కామన్ గురుకుల ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిందని, మద్నూర్‌లోని తెలం గాణ గురుకుల బాలుర విద్యాలయంలో 171 మందికి 171 మంది బాల బాలికలు ప్రవేశ పరీక్షకు వంద శాతం హాజరై పరీక్ష రాసినట్లు వెల్లడించారు.

ఎల్లారెడ్డి: ఉమ్మడి గురుకులాల ఐదవ తరగతి నుండి 9వ తరగతి వరకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ గాంధీ, సావిత్రి, నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదర్శ పాఠశాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో మొత్తం 1161 మందికి 30 గైర్హాజరు అయినట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- చావా
ప్రియా 70	- రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35	- తండేల్

బాన్సువాడ	
మహేశ్వరి	- తండేల్
వెంకటేశ్వర	- రామం రాఘవం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

